క్లుప్తంగా

వీల్‌చైర్, తోపుడు బండ్ల పంపిణీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వీల్‌చైర్లు, వీధి వ్యాపారులకు తోపుడు బండ్లను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పంపిణీ చేశారు. పేదలకు సాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న రోటరీ క్లబ్ సేవలు గొప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజ, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫ్రెషర్స్ డే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు యూనివర్సిటీలో మంగళవారం పీజీ కళాశాల ఎమ్మెస్సీ బోటనీ విభాగంలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. అనంతరం ప్రిన్సిపాల్ డా.కిశోర్ మాట్లాడుతూ వృక్షశాస్త్రంలో ఇంటర్‌ప్రినర్‌షిప్ వైపు అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర హెచ్‌ఓడీ డా.బృందాదేవి, అధ్యాపకులు డా.పి.శివకుమార్‌సింగ్, డా.రాణి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

జడ్చర్ల: రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చేలా చర్యలు చేపట్టాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆయన పర్యటించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొక్కజొన్న తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్దతు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, వెంకటయ్య, మినాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టండి

జడ్చర్ల: ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్వర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాసు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణను అమలు చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ మాదిగలను మోసం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మాదిగలు బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ అశోక్, జడ్చర్ల ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్, భిక్షపతి, నవీన్, శివకుమార్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవాబుపేట: మండలంలోని పోమాల్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. సోమవారం గ్రామానికి చెందిన చాకలి రమేష్ తన భార్యతో కలిసి జిల్లా కేంద్రానికి వెళ్లాడు. రాత్రి 11గంటల సమయంలో ఇంటికి చేరుకోగా, అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో 2.5తులాల బంగారు దొంగిలించినట్లు గుర్తించారు. మంగళవారం బాధితుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

టోల్ సిబ్బందిపై ఫిర్యాదు

మిడ్జిల్: మండల తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి మంగళవారం విధి నిర్వాహణలో భాగంగా కార్యాలయానికి వస్తుండగా మున్ననూర్ టోల్ సిబ్బంది కారు ఆపి టోల్ ట్యాక్స్ కట్టాలని అడిగారు. తాను మండల తహసీల్దార్‌నని చెప్పినా దురుసుగా ప్రవర్తించడంతో తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి టోల్‌గేట్ సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పాత బస్టాండ్ మలుపులోని కోస్గి రోడ్డు పొడవునా కొన్ని నెలలుగా చుట్టుపక్కల గ్రామాల రైతులు వివిధ కూరగాయలు, ఆకుకూరలు తెచ్చి అమ్ముకుంటున్నారు. అటువైపు ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ పెద్ద వాహనాల రాకపోకలతో తరచూ ట్రాఫిక్‌జాం ఏర్పడుతోంది. ముఖ్యంగా రోడ్డుపైనే ఈ అమ్మకాలు కొనసాగుతుండటంతో అక్కడే గుంపులుగా జనం కిక్కిరిసిపోతున్నారు. దీంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు గతంలోనే అప్పటి కలెక్టర్ వెంకట్రావ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన అప్పట్లోనే వారిని వేరే చోటకు తరలించాలని ఆదేశించారు. పలుసార్లు మున్సిపల్ అధికారులు అక్కడికి వెళ్లి రైతులకు నచ్చజెబుతున్నా ప్రయోజనం దక్కడం లేదు. తాజాగా మంగళవారం మరోసారి ట్రాఫిక్ పోలీసులతో పాటు మున్సిపల్ సిబ్బంది వెళ్లి హెచ్చరికలు జారీ చేశారు. న్యూటౌన్‌లోని వక్ఫ్‌బోర్డు స్థలంలో కొనసాగుతున్న కూరగాయల మార్కెట్‌కు తరలిపోవాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ఇదొక్కటే మార్గమని రైతులకు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బుధవారం నుంచి కోస్గి రోడ్డుపై విక్రయాలు చేపట్టొద్దన్నారు.



జాతీయ హోదా ఏమైంది?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి

- జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: పాలమూర్–రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దేవరకద్రలో నిర్వహించిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రతినిధుల సభలో ప్రతిపాదించి తీర్మానం చేయగా, సభకు హాజరైన ప్రతినిధులు ఆమోదించారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం దేవరకద్ర శ్రీనివాస గార్డెన్‌లో నియోజకవర్గ ప్రతినిధుల సభను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి వివిధ అంశాలపై ప్రతినిధులు ప్రసంగించి ప్రతిపాదన చేసి తీర్మానం చేయగా, వాటిని సభలో ఆమోదించారు. నియోజకవర్గంలోని 35మంది లబ్ధిదారులకు చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు రమాదేవి, గుంతమౌనిక, హర్షవర్ధన్‌రెడ్డి, కదిరె శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీలు అన్నపూర్ణ, ఇంద్రయ్యసాగర్, రాజేశ్వరి, కృష్ణయ్య, మున్సిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, మార్కెట్ చైర్మన్ విజయ పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో సత్తాచాటుదాం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: తెలంగాణాతో పాటు జాతీయ రాజకీయాలలో బీఆర్‌ఎస్ సత్తా చాటుదామని ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, తండాల్లో బీఆర్‌ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. బీఆర్‌ఎస్ జెండావిష్కరణ చేశారు. అనంతరం జడ్చర్ల సమీపంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సభలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం బాలానగర్ మండల కేంద్రంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. రాజాపూర్‌లో టీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. దేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలను తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, సాగు నీరు వంటి కార్యక్రమాలను అమలు చేసి వ్యవసాయాన్ని పండుగలా మార్చినట్లు తెలిపారు. బీజేపీ ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తుందని, ప్రజలు గమనించాలని కోరారు. సభలో విద్య, వైద్యం, మిషన్ భగీరథ, ఉపాధి, ఉద్యోగ తదితర పలు అంశాలకు సంబంధించిన తీర్మానాలను ప్రవేశపెట్టారు. జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, రాష్ట్ర కార్యదర్శి వాల్యానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి పాల్గొన్నారు.



జడ్చర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఆదిశంకరాచార్యుల బోధనలు అనుసరించాలి



జడ్చర్ల: ఆదిశంకరాచార్యుల బోధనలను అనుసరించాలని స్థానిక బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బాదేపల్లి రంజిత్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక అయ్యప్ప ఆలయంలో ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు సుమన్ శర్మ, ప్రధాన కార్యదర్శి రమేశ్, కోశాధికారి రాఘవేంద్ర శర్మ, ఉపాధ్యక్షులు దత్తుకుమార్, అంబి రాంచంద్రన్, నరేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా పట్టణంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భగ్వేశ్వర ఆలయంలో ఆదిశంకరుడి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త బార్గవశర్మ, కిరణ్, ప్రసన్నలక్ష్మి, జ్యోతి, రఘునందన్, రాదాకృష్ణ, కృష్ణచార్య పాల్గొన్నారు.

29న పూలే, అంబేడ్కర్ జాతర



హన్వాడ: ఈనెల 29న నిర్వహించబోయే పూలే, అంబేడ్కర్ జాతర వాల్‌పోస్టర్‌ను మంగళవారం చిన్నదర్పల్లి 15వ వార్డు కౌన్సిలర్ లతాశ్రీ ఆవిష్కరించారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడి చైతన్యానికి తోడ్పాటునందించిన పూలే, అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని, జాతరను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దండోరా నాయకులు బాల్‌రాజు, చందర్, ఆంజనేయులు, బీఆర్‌ఎస్ వార్డు అధ్యక్షుడు యాదయ్య, రమేష్, కుమారస్వామి, కృష్ణయ్య, రాములు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం

జిల్లాలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో, పట్టణాల్లో నాయకులు పెద్ద ఎత్తున చేరుకొని బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేశారు. అనంతరం నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రతినిధుల సభకు నాయకులు తరలివెళ్లారు.

– సాక్షి, నెట్‌వర్క్



హన్వాడలో..



నవాబుపేటలో..



మహబూబ్‌నగర్ మండలం ఓబ్లాయిపల్లిలో..



భూత్పూర్‌లో..



మిడ్జిల్‌లో..



మూసాపేటలో..

మానవతా దృక్పథంతో సేవలందించాలి

పాలమూరు: పేదలకు వైద్య సేవలు అందించడంపైనే వైద్య విద్యార్థులు దృష్టి పెట్టాలని, మానవత దృక్పథంతో సేవలు అందించాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంగళవారం రూ.3కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేయగా, ఇందులో రూ.2.45కోట్లతో నిర్మించిన కళాశాల ప్రహరీ, రూ.13లక్షలతో ఏర్పాటు చేసిన స్టూడెంట్ స్కిల్ ల్యాబ్, కళాశాలకు వచ్చిన రెండు కొత్త బస్సులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు తర్వాత మొదటి కళాశాల కావడంతో ఎన్నో కష్టాలకు ఓర్చి అభివృద్ధి చేసుకున్నామని, మూడేళ్ల కాలంలో పీజీ సీట్లు సాధించామని, ఉస్మానియా, గాంధీ మెడికల్ కళాశాల తర్వాత స్థానంలో పాలమూరు ఉందన్నారు. ఇటీవల కాలంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో టీ–హబ్ ఏర్పాటు చేయడం జరిగిందని, పాలమూరులో మరో ప్రభుత్వ ఆస్పత్రి కావాలని సీఎంను కోరిన వెంటనే రూ.500కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరు చేసినట్లు తెలిపారు. కొత్తగా నిర్మించే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయని, వైద్యులకు, సిబ్బందికి క్వార్టర్స్, ప్రత్యేక క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్, మాజీ డైరెక్టర్ పుట్ట శ్రీనివాస్, నవకళ్యాణి, డాక్టర్ జీవన్, డాక్టర్ కిరణ్‌ప్రకాష్, హెచ్‌ఓడీలు నవల్‌కిషోర్, రాధారాణి, రాధ, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

లీకేజీలు వెంటనే సరిచేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ మహమూద్ షేక్

జడ్చర్ల టౌన్: వేసవిని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ పరిధిలోని లీకేజీలు వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్‌షేక్ సూచించారు. మంగళవారం ఆయన వేసవిలో తీసుకునే జాగ్రత్తలపై మున్సిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి వినియోగం పెరిగిన నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. సమావేశంలో ఏఈ ప్రవీణ్‌రెడ్డి, శంషాద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఈటల దిష్టిబొమ్మ దహనం



ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిడ్జిల్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈటల నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని డీసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు గౌస్, మల్లికార్జున్‌రెడ్డి, ఉస్మాన్, బాలస్వామి, జహంగీర్, రాంగౌడ్, శ్రీనునాయక్, సత్యం, శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన

జడ్చర్ల: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె మంగళవారం 9వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం ఎంతమాత్రం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ దీక్ష శిబిరంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. మహిళా సంఘాల బలోపేతానికి వీఓఏలు కృషి చేస్తున్నారని, వారి సేవలకు ప్రతిఫలంగా వేతనాలను రూ.26వేల పెంచాలని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ ఉమాదేవికి అందజేశారు. కార్యక్రమంలో వీఓఏలు రమాదేవి, వసియాబేగం, సరిత, గౌతమి, అలివేలు, కల్పన, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల విడుదల..

ప్రభుత్వ గోదాంలలో హమాలీల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం హమాలీలతో కలిసి చలో కార్మిక కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు ఆంజనేయులు, వెంకటయ్య, చిరంజీవి, తిరుపతయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.



జడ్చర్లలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న వీఓఏలు

మలేరియాపై అవగాహన ర్యాలీ

భూత్పూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మలేరియాపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిద్దామని, దోమల ఉత్పత్తిని అరికడదామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి అబ్దుల్ రబ్, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్లు ప్రమోద్‌కుమార్, శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి మనుప్రియ, సిబ్బంది మరియమ్మ, దేవయ్య, జంగయ్య, గీత తదితరులు పాల్గొన్నారు.



భూత్పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రమాదేవి

దేవరకద్ర: మండలంలోని బస్వాపూర్‌లో మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ రమాదేవి ప్రారంభించారు. రైతులకు మద్దతు ధర లభించాలనే ఉద్దేశ్యంతో గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ హన్మంతు, నాయకులు వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటలపోటీలు



చిన్నారులకు బహుమతి అందజేస్తున్న డీడబ్ల్యూఓ జరీనాబేగం



బాదేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్లు

మహబూబ్‌నగర్ రూరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మంగళవారం రెడ్‌క్రాస్ ఆశ్రమం, టచ్ హోమ్‌లో పిల్లలు ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం డీడబ్ల్యూఓ జరీనాబేగం చిన్నారులకు ఆట వస్తువులు, పండ్లు పంపిణీ చేశారు. మూడు రోజుల పాటు వివిధ పిల్లల రక్షణ గృహాల్లో ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని డీడబ్ల్యూఓ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌బీ కోఆర్డినేటర్ వెంకటమ్మ, డీసీపీఓ నర్మద, బాలల రక్షణ అధికారి రాములు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: బాదేపల్లి సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ దినోత్సవాన్ని చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకునేందుకు వెళ్తున్న చిన్నారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మాంజలి, అంగన్‌వాడీ టీచర్లు అలివేలు, శ్రీలత, భారతి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కి ఘన స్వాగతం

జడ్చర్ల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి జడ్చర్లలో ఘన స్వాగతం లభించింది. మహబూబ్‌నగర్‌లో నిరుద్యోగ మార్చ్‌లో పాల్గొనేందుకు వస్తున్న ఆయనకు 44వ నంబర్ జాతీయ రహదారిపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్ రాజు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు అనంతకిషన్, నవీన్, నిరంజన్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

గండీడ్: మండలంలో చేపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. లింగాయపల్లి, జక్లపల్లి, జిన్నారం, జిన్నారం తండాల్లో ఉపాధిహామీ పనులతో పాటు ఆయా గ్రామాల్లోని నర్సరీలను సందర్శించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ హరిశ్చంద్రుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



జిన్నారంలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి

గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు



భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్లలో మంగళవారం విద్య నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో 2000–2001 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అప్పటి గురువులైన రాజశేఖర్, నరహరి, వెంకటేశ్వర్లు, చెన్నమ్మలను సత్కరించారు.

పట్టాలివ్వాలని ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కోయిలకొండ మండలం అంకిళ్లలో పేద రైతుల భూములకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని దళిత, గిరిజన, బీసీ రైతులు సర్వేనంబర్ 394లో 58.07ఎకరాల భూమికి 38ఏ టెనెంట్ ఉందని, అధికారులు రైతులకు పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో కొనుగోలు చేసినట్లు రైతుల వద్ద సాదా కాగితాలు ఉన్నాయని, సాదాబైనామా కింద క్రమబద్ధీకరించి పట్టాలు ఇవ్వాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే రైతులకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, జిల్లా అధ్యక్షుడు జగన్, ఉపాధ్యక్షుడు పాండు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com